

కథా కౌముది

# అక్షరస్వప్నం - మధురవాణి

ఆఫీసులో రెండు గంటల సేపు భీకరంగా సాగిన టీం మీటింగు అప్పుడే అయిపోయింది. ఆ మీటింగు తాలూకు వాయింపు వల్ల వచ్చిన తలనొప్పిని వదిలించుకోడానికి ఒక పెద్ద కప్పు కాఫీ అందుకుని ఉస్సూరంటూ తన సీట్లోకి వచ్చి కూర్చుంది మధురిమ. పొద్దున్నే ఆఫీసుకి రావడమే మీటింగులో దూరిపోవడం వల్ల ఆ రోజు ఈ-మెయిల్స్ కూడా చూసుకోలేదని గుర్తొచ్చి మెయిల్ బాక్స్ తెరిచి చూసింది. స్వప్నదీపిక పేరుతో క్రితం రోజు రాత్రి వచ్చిన ఒక ఈ-మెయిల్ కనిపించింది. ఆ పేరుతో మధురిమకి తెలిసిన వాళ్ళెవరూ లేరు. మెయిల్ సబ్జెక్ట్‌లో 'ఏమని రాయాలో తెలియట్లేదు' అని కనపడగానే చిత్రంగా అనిపించింది మధురిమకి. ఎవరో ఏమిటో తెలుసుకుందామని ఆసక్తిగా చదవడం మొదలు పెట్టింది మధురిమ.

**డియర్ మధూ,**

'నన్ను డియర్ అని పిలవడానికి ఎంత ధైర్యం' అని అనుకుంటున్నారా! నేనెవరో మీకు తెలీకపోయినా మీరు మాత్రం నాకు అత్యంత సన్నిహితులని నాకనిపిస్తూ ఉంటుంది. అందుకే కాస్తంత చనువు తీసుకుని మిమ్మల్ని మధూ అని పిలిచే ధైర్యం చేశాను. 'కోకిల' పత్రికలో ప్రతీ వారం వచ్చే మీ 'వెన్నెల వాన' శీర్షికని క్రమం తప్పకుండా చదువుతూ ఉంటాను. నేను ఎంతో ఇష్టంగా చేసే పనుల్లో మీరు రాసినవి చదవడం ఒకటి. ఇవ్వాళ్టి శీర్షిక చివరన ఇచ్చిన మీ ఈమెయిల్ ఐడీని చూడగానే ఎగిరి గంతెయ్యాలన్నంత సంబరంగా అనిపించింది. నేనెంతగానో అభిమానించే మధురిమగారితో నేరుగా మాట్లాడవచ్చు అనుకోగానే ఎంత ఉద్వేగంగా అనిపించిందో! నాకైతే చెప్పలేనంత సంతోషంగా వుంది నా అభిమాన రచయిత్రితో ఇలా మాట్లాడగలగడం.

మా ఇంట్లో వాళ్ళందరికీ కూడా మీరంటే చాలా ఇష్టం. ఎందుకంటే నేను చదవడమే కాకుండా వాళ్ళందరికీ కూడా చదివి వినిపిస్తుంటాను. మీరు రాసేవి చదువుతుంటే నిజంగా వెన్నెల వానలో తడుస్తున్నట్టే ఉంటుంది నాకు. మీరు పువ్వులతో, కొమ్మలతో, మబ్బులతో, చుక్కలతో, చందమామతో చెప్పే ఊసులన్నీ చదువుతూ ఉంటే నేనూ మీ పక్కనే ఉండి అవన్నీ కళ్ళారా చూస్తున్నట్టుగా ఉంటుంది. అచ్చంగా మీలాగే నాక్కూడా ప్రకృతి అంటే ఎంతో ఆరాధన. అయినా మీ అంత అందంగా మాత్రం నేను చెప్పలేననుకోండి. అసలెలా అంత అందంగా రాయగలరు మీరు? మీ పూల కుండీలో పూసిన ఒక చిన్ని పువ్వుతో చెప్పిన ఊసులు, ప్రభాతవేళ పలకరించే సూర్య కిరణాలతో మీ ప్రేమాయణం.. అవన్నీ నేనిప్పటికి ఎన్ని సార్లు చదివానో లెక్కే లేదు! ఏంటో.. నా పాటికి నేను అలా వరద గోదారిలా చెప్పుకుపోతున్నానేమో కదూ! మీ అమూల్యమైన సమయంలోంచి ఒక్క నిమిషం నాకు కేటాయించి ఒక్కసారి హాయ్ చెప్పారంటే చాలు.. నాకదే బోల్డంత సంతోషం! చెప్తారు కదూ!

మీ సమాధానం కోసం వెయ్యి కళ్ళతో ఎదురు చూస్తూ..

మీ అభిమాని, స్వప్నదీపిక

●●●

స్వప్నదీపిక రాసిన మెయిల్ చదవడం అయిపోయేసరికి అప్పటిదాకా ఉన్న విసుగు స్థానంలో కొత్త ఉత్సాహం బయలుదేరింది మధురిమలో. తలనొప్పైతే ఎప్పుడు ఎగిరిపోయిందో గుర్తించనే లేదు. తనెవరో ఏవిటో కూడా తెలీకుండా, కేవలం తన పిచ్చి రాతల్ని చూసి అంత అభిమానం చూపుతున్న ఆ అమ్మాయి చాలా అబ్బురంగా కనిపించింది. ఆ అమ్మాయి మాటల్లో కేవలం పొగడ్తలు కురిపించే అభిమానం కంటే, అంతర్లీనంగా ఓ చక్కటి స్నేహతత్వం దాగి ఉందనిపించింది. తన రాతల వల్ల ఒక వ్యక్తికి ఇంత సంతోషం కలుగుతోందనుకుంటే చాలా ఆనందంగా అనిపించింది మధురిమకి. మరి అట్టే ఆలస్యం చేయకుండా స్వప్నదీపిక ఉత్తరానికి సమాధానం రాయడం మొదలు పెట్టింది.

**హాయ్ దీపూ,**

స్వప్నా అని పిలవడం కూడా బాగుందనుకో! కానీ, దీపూ అంటే ఇంకా నచ్చింది. అందుకే అలా పిలిచాను. అసలు స్వప్నదీపిక అన్న మీ పేరు చూడగానే పౌరాణిక సినీమాల్లో తిరిగే గంధర్వ కన్యలూ, కిన్నెరలూ గుర్తొచ్చేశారు నాకైతే. మీ పేరులాగే మీ మనసు కూడా అందమైనది.. సున్నితమైనది కూడా! అందుకే ఎక్కడో పత్రికలో నాలుగు వాక్యాలు రాసే అమ్మాయి మీద ఇంత అభిమానం పెంచేసుకున్నారు. నా పిచ్చి రాతల్ని ఇంతలా ప్రేమించే మీలాంటి ప్రియనేస్తం దొరికినందుకు నాకు చాలా సంబరంగా ఉంది. వెలకట్టలేని మీ అభిమానానికి, ఆప్యాయతకీ మనఃస్ఫూర్తిగా ధన్యవాదాలు చెబుతున్నాను.

ఇక పోతే మీరు నన్ను ధైర్యంగా 'డియర్' అని పిలిచేయొచ్చు. ఇంత అభిమానంగా ఉండే నేస్తాలకి తప్ప ఆ హక్కు ఇంకెవరికుంటుంది చెప్పండి. నిజానికి నాక్కూడా మీ అంత ఉత్సాహంగా, సంతోషంగా ఉంది మీతో మాట్లాడ్డం. అసలే వెయ్యి కళ్ళతో ఎదురు చూస్తాను అన్నారు కదా! అందుకే మిమ్మల్ని అట్టే ఎక్కువసేపు ఎదురు చూపుల్లో నిలపడం ఇష్టం లేక వెంటనే సమాధానం రాస్తున్నాను. నా కబుర్లు వెన్నెలవానలో వింటున్నారు సరే.. మరి మీ కబుర్ల సంగతేంటి? ఇప్పుడు మీరు చెప్తే నేను వింటాను.

ప్రేమతో..

మధురిమ

●●●

"చాలా చాలా చాలా... థాంక్స్ మధూ.. (ఊ.. అని దీర్ఘం వుంటే మధు డియర్ అని అర్థమన్నమాట!) అందరూ నన్ను స్వప్నా అనే పిలుస్తారు కాబట్టి అలానే అలవాటు అయిపోయింది. దీపూ అనే పిలుపంటే నాకూ ఇష్టమే! అందుకే ఎప్పుడూ నా కళ్ళకి కనపడేలా నా మెయిల్ ఐడీలో దీపూ అని పెట్టుకున్నాను. నాకెంతో ఇష్టమైన మీరు నన్ను దీపూ అని అంత ముద్దుగా పిలుస్తుంటే కాదనగలనా! మీ దగ్గర నుంచి ఇంత పెద్ద సమాధానం చూసి ఎంత మురిసిపోయానో తెలుసా! ఇల్లంతా గంతులు వేస్తూ మా ఇంట్లో వాళ్ళందరికీ చెప్పేశాను కూడా! ఈ సంబరంలో మీతో బోల్డన్ని కబుర్లు చెప్పాలని ఉంది. కానీ మధూ.. ఇప్పుడు నాక్కొంచెం ఒంట్లో బాలేదు. అందుకే పెద్ద ఉత్తరం రాయలేకపోతున్నాను. ఇంకో నాలుగు రోజుల్లో ఆదివారం వస్తుంది కదా! ఆ రోజు నేను మళ్ళీ మెయిల్ చేస్తాను. అందాకా సెలవు!

**ప్రేమతో, మీ దీపూ**

ఎంతో ఉత్సాహాన్ని మోసుకొస్తూ స్వప్నదీపిక నుంచి వచ్చిన ఉత్తరం చూసిన మధురిమ ఆ అమ్మాయి అమాయకమైన అభిమానానికి తనలో తనే నవ్వుకుని వెంటనే కుప్తంగా మరో జవాబు రాసి పంపింది.

**హాయ్ దీపూ,**

అందరూ ఎలా పిలిచినా నేను మాత్రం ఇలానే పిలుస్తా! ఒంట్లో సరిగ్గా లేదన్నారు.. ఆరోగ్యం బాగోలేదా ఏంటీ? జాగ్రత్త సుమా! అయితే నా ఉత్తరం పుణ్యమా అని పాపం మీ ఇంట్లో వాళ్ళు మీ గంతులు భరించాల్సి వచ్చిందన్నమాట! అలా బుంగ మూతి పెట్టకు అమ్మడూ.. సరదాగా అన్నానులే! అస్సలేమీ కంగారు లేదు.. నేనెక్కడికీ పోను కాబట్టి మీకు వీలైనప్పుడే పలకరించండి. ఆదివారం వచ్చే మీ ఉత్తరం కోసం ఎదురు చూస్తూ..

**ప్రేమతో,**

**మధురిమ**

●●●

అన్నట్టుగానే ఆదివారం ఉత్తరంతో మధురిమని పలకరించింది స్వప్నదీపిక.

**డియర్ మధూ..**

బావున్నారా! నా విషయానికి వస్తే, అవును కాస్త జ్వరంగా ఉంది ఇప్పుడు కాస్త ఫర్వాలేదు. అవునూ.. మీరు బిజీగా ఉన్నారా? ఇవ్వాళ పొద్దున్నే 'కోకిల' లో మీ శీర్షిక కనపడకపోయేసరికి చాలా దిగులేసింది. మీ మధురమైన వెన్నెలవానలో మమ్మల్ని ఎందుకు తడపలేదు ఇవ్వాళ. నేను అలిగాను మీ మీద!

**మీ దీపూ**

●●●

ఆ మరుసటి రోజు స్వప్నదీపిక ఉత్తరానికి మధురిమ సమాధానం రాసి పంపింది.

**హాయ్ దీపూ,**

అయ్యో! నీకు జ్వరమొచ్చిందా... ఇప్పుడెలా ఉంది? అంతా తగ్గిపోయినట్టేనా! బాగా విశ్రాంతి తీసుకో! ప్రత్యేకంగా బిజీ అంటూ ఏమీ లేదు. నిన్న నా పుట్టిన రోజని అమ్మావాళ్ళు రావడం వల్ల ఇంట్లో హడావుడిగా ఉండి మెయిల్ చూసుకోవడం కుదర్లేదు. ఇవ్వాళ ఆఫీసుకి రాగానే మొదట చేస్తున్న పని నీకు సమాధానం రాయడమే! ఇవ్వాళ్టి పత్రికలో ఏదో ప్రత్యేక వ్యాసం వెయ్యడం వల్ల స్థలం చాల్లేదని నా శీర్షిక వేయలేదుట. ఇలా నా అభిమానులందరూ విచారిస్తున్నారండీ.. ఇంకోసారి ఇలా చేస్తే బాగోదు.. అని వాళ్ళకి గట్టిగా ప్రైవేటు చెప్పేశానులే! వచ్చే వారం యథావిధిగా వచ్చేస్తుంది. అయినా, నీకసలే జ్వరం కదా.. ఇలాంటి సమయంలో వెన్నెల వానలో తడవకపోడమే ఆరోగ్యానికి మంచిది తెలుసా!

ఇంతకీ మీ గురించి ఏమీ చెప్పలేదు.. ఏం చేస్తుంటారు.. తెలుసుకోవచ్చా? ఎందుకో నువ్వు కాలేజీకెళ్ళే అమ్మాయివని అనిపిస్తోంది నాకు! ఏంటో.. కాసేపు నువ్వు, కాసేపు మీరు అంటూ అయోమయంగా పిలిచేస్తున్నా కదా! ఏంటో.. అయ్యో జ్వరమా అని అడగాలనుకున్నప్పుడు అలా చప్పున నువ్వు అని వచ్చేసింది.. ఏమనుకోకేం! ఆరోగ్యం జాగ్రత్త!

**ప్రేమతో, మధురిమ**

●●●

ఆ మరునాటికి మధురిమ మెయిల్ బాక్స్‌లో స్వప్నదీపిక నుంచి వచ్చిన రెండు మెయిల్స్ కనిపించాయి. ఒక మెయిల్లో రకరకాల యానిమేషన్ బొమ్మలతో కూడిన పుట్టిన రోజు శుభాకాంక్షలు కనిపించాయి. అందంగా పేర్చిన ఆ బొమ్మలన్నీ చూస్తుంటే అవతల వ్యక్తి

ఎంతో శ్రమ తీసుకుని, శ్రద్ధగా పంపారని యిట్టే అర్థమైపోతోంది. ఉత్తరం చివర్లో శుభాకాంక్షలతో (నూట నాలుగు టెంపరేచర్‌తో) అని రాసుండటం చూసి ఫక్కున నవ్వేసింది మధురిమ. అంత అందమైన శుభాకాంక్షలు చూసి ఓ క్షణం ముచ్చటగా అనిపించినా అంతలోనే మనసు చివుక్కుమనిపించింది. అసలే ఒంట్లో బాలేదన్న పిల్లని అనవసరంగా ఎంత శ్రమ పెట్టాను. గబుక్కున మాటల్లో నా పుట్టినరోజని అనెయ్యకుండా ఉండాల్సిందని నొచ్చుకుంది. ఆ తరవాత స్వప్నదీపిక నుంచి వచ్చిన మరో ఉత్తరం తెరిచి చూసింది.

**డియర్ మధూ,**

ఎంత మంచి మాట చెప్పారు! నేనింకా ఆ శీర్షిక అయిపోయిందేమోనని బెంగ పడిపోయాను. అయితే వచ్చే వారం నుంచి అంతరాయం లేకుండా వెన్నెలవాన కురుస్తూనే ఉంటుందన్నమాట! చాలా సంతోషంగా ఉంది. నాకింకా జ్వరం తగ్గలేదు మధూ! అసలే వర్షాకాలం కదా.. అందుకే జ్వరాలు వస్తే ఓ పట్టాన తగ్గట్లేదు. వైరల్ ఫీవర్ అని రిపోర్ట్స్‌లో తేలింది. నిన్న రాత్రి నుండి బాడీ టెంపరేచర్ కాస్త పెరిగింది. అందుకే కంప్యూటర్ ముందు కూర్చోవడం కుదరట్లేదు. ప్రతి రోజూ పగలంతా కూడా పడుకునే ఉంటున్నా. ఈ అర్థరాత్రి పూట ఇప్పుడే ఎందుకో మెలకువ వచ్చింది. చాలా అలసటగా ఉంది మధూ! అయినా గానీ మీరు సమాధానం ఇచ్చి ఉంటారని ఆతృత ఆపుకోలేక కంప్యూటర్ ఓపెన్ చేసేసా! జ్వరం తగ్గాక అన్ని విషయాలు మాట్లాడుకుందాం. జ్వరం తగ్గాక మొదట మీతోనే మాట్లాడుతా.. సరేనా!

**బోలెడు ప్రేమతో (మరి కాస్త జ్వరంతో)**

**మీ దీపూ**

●●●

స్వప్న దీపిక ఉత్తరం చదవడం పూర్తయ్యేసరికి తెలీకుండానే మధురిమ కళ్ళ నిండా నీళ్ళు నిండిపోయాయి. ఏ బంధమూ, బంధుత్వమూ లేకపోయినా కేవలం రాతల ద్వారా పరిచయమున్న వ్యక్తి మీద ఎంతటి ఆపేక్ష పెంచుకుంది ఈ అమ్మాయి.. అని చాలా ఆశ్చర్యంగా అనిపించింది. తమ పరిచయం కేవలం వారం రోజులదే అయినా గానీ ఈ స్నేహానుబంధం ఏదో జన్మలోనుంచి ఈ జన్మలోకి కొనసాగుతోందేమో అన్నంత భ్రమ కలిగింది కాసేపు. ఆ క్షణంలో ఆ అమ్మాయి తన మనసుకి ఎంతో దగ్గరైన ఆత్మీయనేస్తంలా అనిపించింది. ఆ అమ్మాయి చూపిస్తున్న ఆప్యాయతకి కరిగిపోయిన మధురిమ 'ఎంత నిష్కల్మషమైన మనసు!' అనుకోకుండా ఉండలేకపోయింది. తనకి వెంటనే జ్వరం తగ్గిపోయి తొందరగా కోలుకోవాలని మనఃస్ఫూర్తిగా దేవుణ్ణి కోరుకుంటూ తనకి జవాబు రాయడం మొదలు పెట్టింది.

**ప్రియమైన దీపూకి,**

అయ్యో.. వైరల్ ఫీవరా నీకు వచ్చింది! అందుకే చాలా నీరసంగా ఉండి ఉంటుంది. కాస్త ఎక్కువ సమయమే పడుతుంది మళ్ళీ హుషారు రావడానికి. అసలు ఇంత జ్వరంగా ఉంచుకుని అంత పెద్ద శుభాకాంక్షల మెయిల్ ఎందుకు తయారు చేసావు? నేనేదో మాటవరసకి అన్నాను. ఓ మారు 'హ్యాపీ బర్త్‌డే' అని ఊరుకోవచ్చుగా! నువ్వింత శ్రమ తీసుకుని శుభాకాంక్షలు తయారు చేసి పంపుతావని అనుకుని ఉంటే, నేనసలు చెప్పేదాన్నే కాదు. చాలా చాలా చాలా అందంగా, ముద్దుగా ఉన్నాయి నువ్వు తయారు చేసి పంపిన బుల్లి బుల్లి బొమ్మల శుభాకాంక్షలు. కానీ, నాకు మాత్రం బాధేసింది. అరెరే..అనవసరంగా నీకంత శ్రమ కలిపించానే.. అసలే ఒంట్లో బాగోలేకపోతే అనిపించింది. ఈ నేస్తాన్ని క్షమిస్తావు కదూ!

అసలు నూట నాలుగంటే ఎంత జ్వరమో తెలుసా నీకు? నువ్వు అస్సలు కంప్యూటర్ ముందు కూర్చోకు. హాయిగా బజ్జో! యీ ఉత్తరానికి సమాధానం కూడా ఇవ్వక్కర్లేదు. జ్వరం తగ్గాక నువ్వన్నట్టు బోలెడు కబుర్లు చెప్పుకుందాం! సరే... మరీ పెద్ద ఉత్తరం రాసేసినా చదవడానికి నీకు నీరసం వస్తుంది. ఇక్కడితో ఆపేస్తున్నా..బాగా విశ్రాంతి తీసుకో. సరేనా! ఆరోగ్యం జాగ్రత్త!

**ప్రేమతో,**

**మధురిమ**

●●●

స్వప్నదీపికకి జ్వరం తగ్గేదాకా కాస్త విశ్రాంతి అవసరం కాబట్టి కొన్ని రోజుల పాటు తనకి ఉత్తరాలు రాయడం మానుకోవాలనుకుంది మధురిమ. కానీ చిత్రంగా తెల్లారేపాటికి స్వప్నదీపిక దగ్గర నుంచి మరో ఉత్తరం వచ్చింది.

**డియర్ మధూ,**

ఎలా ఉన్నారు? నాకు జ్వరం నూట నాలుగు దాటిపోవడంతో ఇంట్లో కంప్యూటర్ ముట్టుకుంటే కాళ్ళు విరక్కొడతామని బెదిరించారు. కాస్త నీరసంగా వుందని ఇంట్లో చెప్పి డాక్టర్ చెకప్ కోసం వచ్చాను. డాక్టరు కొంచెం తెలిసినాయనలే.. అందుకే ఆయన డెస్క్ మీదున్న లాప్‌టాప్ అందుకుని మీకు మెయిల్ పెడుతున్నా! చూడండి నేను ఎంత మంచిదాన్నో కదా! తొందర్లోనే కోలుకొని హాయిగా కబుర్లు చెప్పుకుందాం. జ్వరం తగ్గాక మొదట మీతోనే మాట్లాడతాను.. సరేనా!

**అందాకా.. బోలెడంత ప్రేమతో,**

**మీ దీపూ.**

●●●

ఉత్తరం చదివి.. 'ఎంత అల్లరి పిల్ల!' అని నవ్వుకుని.. వెంటనే తనకి జవాబు రాసింది మధురిమ.

**ప్రియమైన దీపూ,**

నువ్వు చాలా మంచిదానివి. అందుకే మీ ఇంట్లోవాళ్ళతో పాటు నా మాట కూడా విను. జ్వరం తగ్గేదాకా కంప్యూటర్ జోలికి వెళ్ళకు. అసలు ఏ పనీ చేయొద్దు. ఏదైనా మంచి సంగీతం పెట్టుకుని వింటూ హాయిగా బజ్జో! బాగా విశ్రాంతి తీసుకో. ఇక్కడి నుంచే నీకో మంత్రం వేసేశాను. జ్వరం, నీరసం అంతా రెండ్రోజుల్లో పూర్తిగా ఎగిరిపోతాయి. అప్పుడు తీరిగ్గా మాట్లాడదాం. జ్వరం పూర్తిగా తగ్గిపోయి బాగా హుషారొచ్చేదాకా కష్టపడి ఉత్తరాలు రాయకు. సరేనా.. ఆరోగ్యం జాగ్రత్త!

**ప్రేమతో,**

**మధురిమ**

ఆ తరవాత ఓ వారం రోజుల దాకా స్వప్నదీపిక నుంచి మరే ఉత్తరమూ రాలేదు. జ్వరం తగ్గాక తనే జవాబు ఇస్తుందిలే అని మధురిమ కూడా పలకరించే ప్రయత్నం చేయలేదు. ఒక రోజు రాత్రి పూట యథాలాపంగా టీవీలో వార్తలు చూస్తూ ఉండగా.. రాష్ట్రంలో ఎన్నడూ లేనంతగా భారీ వర్షాలు కురుస్తున్నాయని, ఆ కారణంగా వైరల్ జ్వరాలు విపరీతంగా పెరిగాయనీ, వాటిల్లో చాలా రకాల జ్వరాలను కొత్తవాటిగా డాక్టర్లు గుర్తించారనీ, కొన్ని రకాల వైరల్ జ్వరాల కారణంగా అకస్మాత్తుగా రక్తంలో పెనుమార్పులు సంభవించి చాలామంది ప్రాణాలు కూడా కోల్పోతున్నారని చెప్పారు. వైరల్ జ్వరం అనగానే మధురిమకి చప్పున స్వప్నదీపిక గుర్తొచ్చింది. తనతో మాట్లాడి చాలా రోజులైపోయిందని గుర్తొచ్చి అప్పటికప్పుడు వెళ్ళి కూర్చుని తన క్షేమసమాచారాలు తెలపమని ఒక మెయిల్ పెట్టి వచ్చింది.

ఆ తరవాత వారం రోజులైనా తన దగ్గరి నుంచి జవాబు రాకపోయేసరికి మధురిమకి ఆందోళన మొదలైంది. తన దగ్గర నుంచి జవాబు రాకపోవడం చేత చాలా బెంగగా ఉందంటూ, కనీసం ఒక్క ముక్కలోనైనా తన క్షేమం తెలపమని స్వప్నదీపికకి నాలుగైదు సార్లు మెయిల్ పెట్టింది మధురిమ. వాటిలో ఏ ఒక్కదానికీ సమాధానం రాలేదు. అప్పుడప్పుడూ ఆ రోజు టీవీ వార్తల్లో విన్న విషయాలు జ్ఞాపకం వచ్చి ఓ క్షణం గుండె ఝల్లుమంటోంది మధురిమకి. అంతలోనే.. ఎక్కడో ఏదో జరిగిందని మరీ ఇంత వెర్రిగా ఆలోచిస్తే ఎలా అని తనకి తానే సర్ది చెప్పుకుంటోంది.

కానీ, ఎంతగా ఆలోచించినా స్వప్నదీపిక క్షేమ సమాచారాలు ఎలా తెలుసుకోగలదో మధురిమకి అంతు పట్టలేదు. ఒక్క ఈ-మెయిలు అడ్రసు తప్పించి స్వప్నదీపికకి సంబంధించిన మరే వివరాలూ మధురిమకి తెలీదు. అలా అలా రోజులు, వారాలు, నెలలు గడుస్తున్నాయి. తను జ్ఞాపకాని కొచ్చినప్పుడల్లా స్వప్నదీపికకి ఉత్తరాలు రాస్తూనే ఉంది మధురిమ. వాటిల్లో ఒక్కదానికి కూడా జవాబు రావడం లేదు. అయినా, ఏదో ఒక రోజు స్వప్నదీపిక దగ్గర నుంచి జవాబు వస్తుందన్న నమ్మకం పూర్తిగా చెరిగిపోలేదు మధురిమ మనసులో.

మధురిమ ఓ సారి తన 'వెన్నెల వాన' కోసం స్నేహం గురించి రాస్తూ చివరి వాక్యం ఇలా రాసుకుంది.

జీవిత ప్రయాణంలో కొన్ని స్నేహాలు అలా అలవోకగా ఓ సాయంకాలపు వాసంత సమీరంలా మృదువుగా మనల్ని తాకి వెళ్ళిపోతాయి. ఆ గాలి తెమ్మెర మనల్ని దాటిపోయినా దాని తాలూకు స్నేహ పరిమళం మాత్రం ఓ మధుర జ్ఞాపకంలా భద్రంగా మన మదిలో కొలువుండిపోతుంది. కేవలం నా అక్షరాల్లో నన్ను చూసి అభిమానించిన ఓ నేస్తం, అలాంటి మరికొన్ని అక్షరాల్లోనే నాకు ఆప్యాయతను పంచిన ఆ ప్రియనేస్తం.. నా మది తీరపు మధురస్మృతిలో ఒక అక్షరస్వప్నంలా నిలిచిపోయింది!

*✱ఏ సంబంధమూ లేకపోయినా కేవలం అక్షరాల బంధంతో అభిమానం పెంచుకుని వెలకట్టలేని ప్రేమను పంచే స్వప్నదీపిక లాంటి అభిమానులందరికీ ఈ కథ అంకితం!*

*మధురవాణి గారు గత ఐదేళ్ళుగా జర్మనీలో నివసిస్తున్నారు. జీవశాస్త్రంలో డాక్టరేటు పూర్తి చేసి ప్రస్తుతం జీవశాస్త్ర సంబంధిత పరిశోధనలోనే సైంటిస్టుగా పనిచేస్తున్నారు. తన ఆలోచనలు, అభిప్రాయాలు 'మధురవాణి' బ్లాగులో వ్రాస్తూనే అప్పుడప్పుడూ కథలు కూడా వ్రాస్తుంటారు. తెలుగు పుస్తకాలు చదవడం, తెలుగు పాటలు వినడం, ఫోటోలు తీయడం మధురగారి అభిరుచులు.* http://madhuravaani.blogspot.com



Click here to share your comments on this story